

బోధన్ : శక్కర్‌నగర్‌లో రావణ దహనం..

ఆత్మీయ ఆలింగనాలు.. ఆయుధ పూజలు

నిజామాబాద్ సాంస్కృతికం : చెడుపై మంచి విజయం సాధించాలని కోరుకుంటూ.. జిల్లా ప్రజలు శనివారం దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. శమీ పూజలు, అర్చనలు, పంచామృతాభిషేకాలు, మంగళహారతులు సమర్పించారు. పలు ప్రాంతాల్లో రావణ సంహారం జరిపారు. జమ్మి బంగారం బంధుమిత్రులు, పెద్దలకు ఇచ్చి ఆశీస్సులు, అభినందనలు అందుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. అలయ్ బలయ్ నిర్వహించారు. బంగారం, నూతన వాహనాలు కొనుగోలు చేసి ఆలయాల్లో పూజలు చేయించారు. ఇందూరు ఆర్యనగర్ ఆధ్వర్యంలో సీమోల్లంఘన ఊరేగింపు చేపట్టారు.

ఇందూర్ సిటీ: నగరంలోని సీపీ కార్యాలయంలో దసరా పురస్కరించుకొని సీపీ కల్మేశ్వర్ ఆయుధపూజ నిర్వహించారు. అదనపు డీసీపీలు కోటేశ్వర్‌రావు, శంకర్‌నాయక్, బస్వారెడ్డి, ఏసీపీ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆయుధ పూజ నిర్వహిస్తున్న సీపీ కల్మేశ్వర్, ఇతర అధికారులు

రెండు పడకల ఇళ్లలో కదలిక

పూర్తయిన వాటి పంపిణీకి కసరత్తు

ఈనాడు, నిజామాబాద్

గత ప్రభుత్వ హయాంలో పూర్తయిన రెండు పడకగదుల ఇళ్ల పంపిణీ చేసేందుకు కసరత్తు మొదలైంది. అర్హులైన పేదలను ఎంపిక చేసి.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆమోదం మేరకు వీటిని అందజేయాలని ప్రస్తుత సర్కారు నిర్ణయించింది. ఇటీవల ఆయన కలెక్టరేట్‌లో జరిపిన సమీక్షలోనూ ఈ విషయంలో సూచనలు చేశారు. ఈ నేపథ్యంలోనే జిల్లా అధికారులు ఇళ్ల నిర్మాణ బాధ్యతలు చూసిన పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నారు. పూర్తయిన చోట.. మౌలిక సదుపాయాలు కల్పించి పంపిణీ చేయటంతోపాటు స్లాబు దశలో ఆగిపోయిన చోట మిగిలిన పనులు చేయించేలా గుత్తేదారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రస్తుతం నిర్మాణాలు ఉన్న దశ ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు.

15,300 ఇళ్లు మంజూరు..

ప్రభుత్వం నుంచి గత తొమ్మిదేళ్లలో పలు విడతల్లో జిల్లాకు 15,300 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిల్లో 13 వేల ఇళ్లకు టెండర్లు పూర్తయ్యాయి. టెండర్లు దక్కించుకున్న కొందరు గుత్తేదార్లు మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. యూనిట్ వ్యయం రూ.5 లక్షలు గిట్టుబాటు కాదంటూ నిరాసక్తి చూపారు. ఒప్పందాలు చేసుకున్న వారిలో కొందరిని ఒప్పించి పనులు చేపట్టడంతో 3700 ఇళ్లు పూర్తయ్యాయి. వీటిల్లో పలు మండలాల్లో 2100 వరకు పంపిణీ చేశారు. మిగిలిన 1600 ఇళ్లను ఇదివరకు వచ్చిన దరఖాస్తుల్లో నిబంధనలకు లోబడి అర్హులను ఎంపిక చేసి అందించనున్నారు. ఇవి కాకుండా బోధన్ రెవెన్యూ డివిజన్‌లో సొంత స్థలాలు ఉన్నవారికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేయగా.. ఇలా మరో 4 వేలు పూర్తికాగా.. లబ్ధిదారులు గృహాల్లోకి చేరిపోయారు. వీరితో పాటు ఇందల్‌వాయి మండలంలో ఇప్పటికే ఇళ్లలో చేరిన వారికి ప్రభుత్వ పట్టాలు జారీ కాలేదు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనుమతి తీసుకొని వీటికి పట్టాలు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



మరమ్మతులకు నిధులు..

కొన్నిచోట్ల మూడేళ్ల కిందటే నిర్మాణాలు పూర్తయినా పంపిణీలో జాప్యంతో ఆకతాయిలకు అడ్డాలుగా మారాయి. కిటికీలు, అద్దాలు ధ్వంసమై.. నల్లాలు ఎత్తుకెళ్లిన పరిస్థితి. ఆయా చోట్ల మరమ్మతులు చేపట్టి.. పంపిణీకి సిద్ధం చేయడానికి రూ.2 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులిచ్చారు. తాగునీరు, మురుగు వ్యవస్థ, రహదారి సౌకర్యం వంటివి ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

వివిధ దశల్లో 3,400..

జిల్లాలో వివిధ దశల్లో ఆగిపోయిన సుమారు 3400 ఇళ్లను కూడా రెండు, మూడు నెలల్లో పూర్తి చేయించాలని ఇటీవల జరిగిన సమీక్షలో జిల్లా అధికారులను ఇన్‌ఛార్జి మంత్రి ఆదేశించారు. ఈ క్రమంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించిన కలెక్టర్, గుత్తేదారులతో సంప్రదింపులు జరిపి ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్ణయించిన యూనిట్ ధర పరిధిలోనే వ్యయాలు ఉండేలా వాటిని పూర్తి చేయించాలని చెప్పారు. గుత్తేదారులు ముందుకు రాక, భూమి విషయంలో సమస్యలతో మరో 3 వేల వరకు నిర్మాణాలు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ప్రస్తుతం వీటిని చేపట్టే ఆలోచన లేదంటున్నారు.

తండ్రి రాసిన మరణశాసనం

ఉమ్మడి జిల్లాలో సంచలనంగా నందివాడ ఘటన

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, తాడ్వాయి: మానసిక వేదన ముగ్గురి ఊపిరి తీసింది. అత్తింట్లో గౌరవం దక్కడం లేదని, తాను చిన్నచూపునకు గురవుతున్నానని మానసిక వేదనకు గురయ్యాడు తాడ్వాయి మండలం నందివాడకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి. దసరా రోజున తాను ఆత్మహత్య చేసుకోవడమే కాకుండా ఇద్దరు కుమారులను బావిలో పడేసి వారి ఊపిరినీ తీశాడు. ఒకే ఇంట్లో ముగ్గురు చనిపోవడం గ్రామస్థులను కలిచివేసింది.

కదిలివచ్చిన గ్రామస్థులు

పసిపిల్లలు ఇద్దరు పడిన బావి వద్దకు ఆదివారం ఉదయం ఊరంతా కదిలి వచ్చింది. తొలుత విఘ్నేష్‌రెడ్డి, అనిరుధ్‌ల మృతదేహాలు బావిలో తేలగా.. శ్రీనివాస్‌రెడ్డి ఆచూకీ లభించలేదు. అతడి కోసం కుటుంబీకులు, గ్రామస్థులు గాలింపు చేపట్టారు. బావి సమీపంలో శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన చరవాణి, చెప్పులు కనిపించాయి. దీంతో బావిలోని నీటిని తోడేసి గాలించడంతో అతడి మృతదేహం లభించింది. చనిపోయిన పిల్లలు ఇద్దరు తాడ్వాయి మండలకేంద్రంలోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. గత నెలలో చిన్నకుమారుడి పుట్టిన రోజు వేడుకలను సైతం కుటుంబసభ్యులు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. దసరా పండగను పురస్కరించుకొని పిల్లలకు కొత్త దుస్తులు కొనిచ్చారు. ఈ సమయంలోనే తనకు కొత్త బట్టలు కొనివ్వాలని శ్రీనివాస్‌రెడ్డి భార్య అపర్ణను, కుటుంబీకులను కోరగా.. ఉన్నవాటితో సరిపెట్టుకోవాలని చెప్పినట్లు తెలుస్తోంది. ఇల్లరికం వచ్చానని, తనను చిన్నచూపు చూస్తున్నారని శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన చెందినట్లు బంధుమిత్రులు వెల్లడించారు. తన పిల్లలు సైతం భార్య వద్ద ఉండకూడదని కుమారులిద్దరిని బావిలో పడేసినట్లు తాను ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం.

ఆనందం... ఆవిరై

చిన్నారులు దసరా పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొన్నారు. దుర్గామాత మందిరంలో సందడి చేశారు. తనను అత్తింటివారు చిన్నచూపు చూస్తున్నారనే ఉద్దేశంతో శ్రీనివాస్‌రెడ్డి చిన్నారులకు మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లాడు. మాటల్లో పెట్టి వారిని బావి వద్దకు తీసుకెళ్లి పడేసి తానూ ఆత్మహత్య చేసుకున్నాడు.

దర్యాప్తు మొదలుపెట్టిన పోలీసులు

శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరు బిడ్డలను చంపి, తానూ ఆత్మహత్య చేసుకోవడానికి కుటుంబం చిన్నచూపేనా లేదా మరేదైనా కారణం ఉందా ? అనే కోణంలో పోలీసులు విచారణ మొదలు పెట్టారు. శ్రీనివాస్‌రెడ్డి కుటుంబీకులు, గ్రామస్థుల నుంచి వివరాలు ఆరా తీస్తున్నారు. మృతదేహాల పోస్టుమార్టం తర్వాత వచ్చే నివేదిక ఆధారంగా విచారణ చేపట్టాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడడంతో మొదలైన ఆర్థిక ఇబ్బందులతోనే శ్రీనివాస్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై పోలీసులు కూపీ లాగుతున్నారు. ఘటనాస్థలాన్ని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



చిన్నారుల మృతదేహాలను పట్టుకొని రోధిస్తున్న తల్లి అపర్ణ

సన్నాల సేకరణకు 465 కేంద్రాలు

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్



- వానాకాలం ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం
- 'న్యూస్‌టుడే'తో పౌరసరఫరాల సంస్థ డీఎం రమేశ్

వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన ప్రతి గింజను కొంటామని.. ఇప్పటికే జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు కావాల్సిన ఏర్పాట్లు చేసినట్లు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వైపీ.రమేశ్ తెలిపారు. ఇదివరకే సన్నాహక సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ధాన్యం సేకరణకు చేసిన ఏర్పాట్లు, ఇతర విషయాలను ఆయన 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో పంచుకున్నారు.

● **ప్రశ్న:** సన్నాలకు బోనస్ నేపథ్యంలో జిల్లా రైతులు వీటినే ఎక్కువగా సాగు చేశారు. వీటి సేకరణ ఏవిధంగా చేయనున్నారు?

■ **సమాధానం:** ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 629 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇందులో సన్న రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా 465, దొడ్డు రకం తీసుకునేందుకు 164 కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాగానే వాటిని ప్రారంభిస్తాం.

● ధాన్యం సేకరణకు కావాల్సిన గన్నీ సంచులున్నాయా?

■ ఈ సీజన్‌లో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం ఉంది. ఇందులో సన్న రకం ధాన్యం 7,10,762 మె.ట, దొడ్డు రకం 89,238 మె.ట వస్తుందని అంచనాలు రూపొందించాం. ధాన్యం సేకరణకు 2 కోట్ల గన్నీ సంచులు అవసరమవుతాయి. ప్రస్తుతం 80 లక్షల సంచులున్నాయి. ఇంకా 1.20 కోట్లు కావాలని ప్రభుత్వానికి నివేదించాం.

● గత సీజన్‌లో సకాలంలో డబ్బులు తమ ఖాతాల్లో పడలేదని రైతులు వాపోయారు. ఈసారి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

■ ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్‌లో వివరాలు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బంది లేకుండా వడ్లు కొనుగోలు చేసిన 48 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు పడేలా చూస్తాం. హమాలీలు, లారీల కొరత రానివ్వం.

● డిఫాల్టర్ మిల్లులకు ధాన్యం కేటాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి?

■ గత సీజన్‌లో బియ్యం ఇవ్వని 35 రైస్ మిల్లులను డిఫాల్టర్లుగా గుర్తించాం. వారికి ఎట్టి పరిస్థితిలో ధాన్యం కేటాయించే ప్రసక్తే లేదు. బ్లాక్ లిస్టులో పెట్టిన ఆయా మిల్లులకు నోటీసులు జారీ చేశాం. క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశాం.

వీరి సేవ.. భిన్నమైన తోవ ★ రైతులకు లక్ష్మి కటాక్షం!

★ సమస్యలు అధికం.. మరమ్మతుల్లో జాప్యం ... 6వ పేజీలో

శ్రీరామసాగర్‌కు తగ్గిన వరద

శ్రీరామసాగర్ : శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ నుంచి వరద చేరిక 3590 క్యూసెక్కులకు తగ్గింది. జలాశయంలో 1091 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం, 80.501 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జలాశయం నుంచి లక్ష్మి కాల్వ ద్వారా 150, సరస్వతి కాల్వ నుంచి 500, ఇందిరమ్మ వరద కాల్వకు 2000, మిషన్ భగీరథతో 231 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల జరుగుతోంది. 709 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో తగ్గుతోంది.

దసరా కిక్కు..

రూ.20 కోట్ల మద్యం విక్రయాలు

మాక్లూర్, న్యూస్‌టుడే: దసరా సంబరాలు అంబరాన్నంటాయి. ఏకంగా రూ.20 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 151 వైన్స్‌లు, 21 బార్లు ఉన్నాయి. వాటికి మాక్లూర్ మండలం మాదాపూర్‌లోని ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్) డిపో నుంచి విస్కీ, బీరు సరఫరా అవుతోంది. పండుగ సందర్భంగా కేవలం మూడు రోజుల్లో రూ.20 కోట్ల విలువైన 40 వేల కేసుల బీరు, 20 వేల కేసుల విస్కీ అమ్మకాలు జరిగాయి. చీకటి పడినా ఎక్సైజ్ అధికారులు మాత్రం ఐఎంఎల్ డిపోలోనే మకాం వేసి టార్గెట్ కోసం వ్యాపారులతో మందు కొనుగోలు చేయించడం గమనార్హం. ఇక బెల్ట్ షాపులైతే జాతరను తలపించాయి.





అభివాదం చేస్తున్న నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు

రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: అన్నదాత ఆత్మీయ సమ్మేళనం ఆదివారం విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర ఛైర్మన్ అన్వేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్‌లోని కార్యాలయ ఆవరణలో జరిగింది. రాజకీయ పార్టీలకు అతీతంగా అన్నదాతలను ఏకతాటిపైకి తీసుకొచ్చి కిసాన్ మిలాప్ పేరుతో ఏటా సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం నాయకులు అలయ్ బలయ్ ఇచ్చుకున్నారు. అందరూ కలిసి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఆర్మూర్, బాల్కొండ కాంగ్రెస్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి, భాజపా నాయకులు పల్లె గంగారెడ్డి, తెదేపా నాయకులు దేగాం యాదాగౌడ్, న్యూడెమోక్రసీ నాయకులు ప్రభాకర్, దేవారాం, తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో నిబంధనల ఉల్లంఘన!

విద్యుత్తు శాఖలో ప్రక్రియపై ఆరోపణలు

న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్

విద్యుత్తు శాఖలో ఉద్యోగుల బదిలీలు నిబంధనల మేరకు చేపట్టలేదనే ఆరోపణలు వస్తున్నాయి. పలు యూనియన్ నాయకుల ఒత్తిడి మేరకు ఈ ప్రక్రియ జరిగిందని తెలుస్తోంది. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు అధికారులు బదిలీ జాబితాను శుక్రవారం రాత్రి విడుదల చేశారు. ఈ క్రమంలో పలుకుబడి ఉన్న వారికి అనుకున్న చోట.. మిగిలిన వారిని దూర ప్రాంతాలకు పంపారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నగరంలోని ఓ సెక్షన్‌లో పని చేసే ఏఈని బోధన్ కన్‌స్ట్రక్షన్ విభాగానికి బదిలీ చేస్తున్నట్లు వెల్లడించారు. సదరు ఉద్యోగి ఏడీఈ, కన్‌స్ట్రక్షన్ నిజామాబాద్‌కు రిపోర్టు చేయాలని సూచించారు. వాస్తవానికి బోధన్‌లో ఈ విభాగం లేదు. అధికారులు తప్పుగా చూపించారు. నిబంధనల ప్రకారం సదరు ఏఈ బోధన్, ఆర్మూర్ ఆపరేషన్ విభాగానికి బదిలీపై వెళ్లేవారు. కొంతమంది అధికారులు వారిని కాపాడే ప్రయత్నం చేయడంతోనే ఇలా తప్పు చేసినట్లుగా తెలుస్తోంది.

- కొందరు ఉద్యోగులు పవర్‌హౌజ్‌లోని ఓ విభాగంలో పని చేస్తుండగా బదిలీల్లో భాగంగా.. అదే పవర్‌హౌజ్‌లోని వేరే విభాగానికి బదిలీ అయ్యారు.
- వేరేచోటుకు బదిలీ చేయాలంటే రెండేళ్ల సర్వీసు పూర్తి కావాలి. కాని డిచ్‌పల్లి సబ్ డివిజన్ పరిధిలో ఓ ఏఈ 19 నెలలు మాత్రమే పనిచేశారు. ఆయన పేరు జాబితాలో రావడంతో ఇదేమిటని ఏఈ ఉన్నతాధికారులు ప్రశ్నించడంతో.. యథా స్థానంలోనే ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. ఇలా నిబంధనలకు అతీతంగా బదిలీలు చేశారని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లిన ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని.. ఎలాంటి అనుమానాలు లేవని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. బదిలీ అయిన వారు 15వ తేదీన కేటాయించిన చోట విధుల్లో చేరాలని ఆదేశించారు.

వీరి సేవ.. భిన్నమైన తోవ

● ఆదర్శంగా నిలుస్తున్న యువజన సంఘాలు

యువత చాలా మంది ఉన్నా కొందరే భిన్నమైన పంథా ఎంచుకుంటారు. ఇతరుల సమస్యలపై స్పందించి తమ వంతుగా పరిష్కరించేందుకు చూస్తారు. సామాజిక ఇబ్బందులుంటే తమ స్థాయిలో తొలగించేందుకు కృషి చేస్తారు.. అలాంటి యువకులే వీరు.. కొందరు సంఘంగా ఏర్పడి తమ పల్లెల రూపురేఖలు మార్చేందుకు నడుంబిగిస్తే.. మరికొందరు అభాగ్యులకు అన్నం పెట్టి ఆకలి తీరుస్తున్నారు.. ఆదర్శంగా నిలుస్తున్న వీరిపై ప్రత్యేక కథనం..

న్యూస్‌టుడే, ఇందూర్ సిటీ

ఐదేళ్లుగా.. రూ.20 లక్షల ఖర్చు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: 'మానవ సేవే మాధవ సేవ' నినాదంతో 2019 డిసెంబరు 1న శ్రీలక్ష్మి చేయూత స్వచ్ఛంద సేవా సంస్థను అలవాల లక్ష్మణ్, వంగల రమణా చారి, తాటి శ్యామ్‌కుమార్‌తో పాటు మరో 20 మంది సభ్యులు కలిసి ప్రారంభించారు. ప్రస్తుతం సంస్థలో 170 మంది సభ్యులున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, అంతిమయాత్ర నిర్వహించుకోలేని వారిని గుర్తించి రూ.5-10 వేల వరకు ఇస్తారు. ఎవరైనా అనుకోని ఘటనతో వీధిన పడితే మూడు నెలలకు సరిపడా సరకులు అందిస్తారు. పేద అమ్మాయిల పెళ్లిళ్లకు పుస్తె, మెట్టెలు, రూ.30 వేల నగదు, వంట సామగ్రి అందజేస్తారు. నిజామాబాద్‌తో పాటు నిర్మల్, జగిత్యాల, కామారెడ్డిలో సేవలు కొనసాగిస్తున్నారు. ఈ ఐదేళ్లలో రూ.20 లక్షలు సేవా కార్యక్రమాలకు వెచ్చించడం గమనార్హం.



బాధిత కుటుంబానికి రూ.10 వేలు సాయం అందిస్తున్న ప్రతినిధులు

ఆకలి తీరుస్తూ..

ఆర్మూర్ పట్టణం మామిడిపల్లికి చెందిన స్నేహితులు 2022 సెప్టెంబరులో కింగ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా నిరాశ్రయులకు నిత్యం అన్నం పెడుతూ కడుపు నింపుతున్నారు. నిత్యం 200 మందికి అన్నదానం చేస్తున్నారు. వీరిని చూసి ఆర్మూర్ పట్టణానికి చెందిన మరికొందరు ముందుకొచ్చారు. ఇందు కోసం సంఘంలోని సభ్యులే డబ్బులు వేసుకుంటారు. వీరి సేవలను పట్టణ ప్రజలు కొనియాడుతున్నారు.



ఆహారం అందిస్తున్న కింగ్ ఫౌండేషన్ సభ్యుడు

గ్రామ రూపురేఖలు మార్చేందుకు

నిజామాబాద్ గ్రామీణ మండలం కొండూర్ యువత తమ పల్లె అభివృద్ధికి నడుం బిగించారు. 2006లో 40 మందితో వాయుపుత్ర యూత్ సొసైటీ ఏర్పాటు చేశారు. గ్రామ సమస్యల పరిష్కారానికి నిత్యం కొంత సమయం కేటాయిస్తారు. పరిశుభ్రత, క్రీడలు, మొక్కల పెంపకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా డబ్బాలు ఏర్పాటు చేశారు. నెహ్రూ యువ కేంద్రం ప్రోత్సాహంతో మండలంలో ఇతర పల్లెల్లోనూ ఇంకుడు గుంతలు నిర్మించారు. సీజనల్ వ్యాధులు, గర్భిణులకు ఆహార అలవాట్లు, ఆరోగ్య శిబిరాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో నిరుద్యోగ యువతకు ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు మూడుసార్లు జిల్లా ఉత్తమ యువజన సంఘంగా పురస్కారం అందుకున్నారు.



చెత్త సేకరించి డబ్బాలో వేస్తున్న వాయుపుత్ర యూత్ సొసైటీ సభ్యులు



జీవాల విక్రయం @ ₹4కోట్లు

రాష్ట్రంలోనే అతి పెద్ద మేకల అంగడి నవీపేటలో నిర్వహిస్తారు. ప్రతి శనివారం సగటున రూ.కోటికి పైగా వ్యాపారం జరుగుతుంది. ఈ సారి దసరా పండగ రోజే అంగడి రావడంతో సుమారు రూ.4కోట్ల జీవాల విక్రయాలు జరిగినట్లు వ్యాపార వర్గాలు పేర్కొన్నారు. 8వేలకు పైగా మేకలు, గొర్రెలను వ్యాపారులు సంతకు తీసుకువచ్చారు. మహారాష్ట్రతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి జీవాలు కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో అంగడి కిక్కిరిసిపోయింది. పది కిలోల పొట్టేలు రూ.12 వేల నుంచి 14 వేలు పలికింది. భారీ సంఖ్యలో కొనుగోలుదారులు రావడంతో నవీపేటలోని రోడ్లు రద్దీగా మారాయి. మధ్యాహ్నం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

– న్యూస్‌టుడే, నవీపేట

సమస్యలు అధికం.. మరమ్మతుల్లో జాప్యం

● డొంకేశ్వర్ పీహెచ్‌సీలో పూర్తికాని పనులు

న్యూస్‌టుడే, నందిపేట్

జిల్లాకు శివారు మండలం డొంకేశ్వర్. ఉమ్మడి నందిపేట్ మండలంలోని 16 గ్రామాల ప్రజలకు వైద్యానికి డొంకేశ్వర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే ప్రధాన ఆధారం. కానీ ఇక్కడ సరైన వసతులు లేక రోగులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. సమస్యను గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో మరమ్మతులకు రూ.15 లక్షలు మంజూరు చేసింది. కానీ పనులు చేపట్టడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి త్వరగా పూర్తి చేయించాలని కోరుతున్నారు.

ఏయే సమస్యలంటే..

ఆసుపత్రిలోని గోడలు, గదుల్లోని అడుగు భాగం ధ్వంసమైంది. విద్యుత్తు వ్యవస్థ చెడిపోయింది. పైపులైను అస్తవ్యస్తంగా మారడంతో లీకేజీలు ఏర్పడ్డాయి. గతంలో నిర్మించిన ప్రహరీ కూలిపోవడంతో పశువులు ప్రాంగణంలోకి వస్తున్నాయి. పరిసరాల్లోని సీసీ ప్లాట్‌ఫాం లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. పీహెచ్‌సీలోని సమస్యలను రోగులు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లగా 14 నెలల కిందట నిధులు విడుదలయ్యాయి. టెండరు, ఒప్పంద ప్రక్రియ ముగిసి కొన్ని పనులు చేపట్టి బిల్లులు కూడా తీసుకున్నారు. మిగతా పనులు చేయడం లేదు. ఈ విషయమై ప్రజలు ఏడాదిగా అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు..



అధ్వానంగా నీటి కుళాయి



ప్రవేశ ద్వారం ఎదుట ఇలా..



పగిలిన టైల్స్

డొంకేశ్వర్ పీహెచ్‌సీ స్వరూపం

పరిధిలోని ఉప కేంద్రాలు - 06

వైద్యం కోసం వచ్చే గ్రామాలు - 16

నిత్యం ఓపీ - 50 నుంచి 60

ఇబ్బందులు పడుతున్నాం

- సురేందర్, పీహెచ్‌సీ పర్యవేక్షకుడు

పెండింగ్ పనులు చేయకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. పశువుల సంచారం, పిచ్చి మొక్కలతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

త్వరలో పూర్తిచేస్తాం

- రాజ్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ

నేను మండలానికి ఇటీవలే వచ్చాను. పనులు పెండింగ్‌లో ఉన్నాయని మా దృష్టికి వచ్చింది. గుత్తేదారుతో మాట్లాడాం.. త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించాం. వీలైనంత త్వరగా మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం.



నేడు కలిగోట్‌లో బతుకమ్మ సంబురాలు

జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే: జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్‌లో బతుకమ్మ వేడుకలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. దసరా పర్వదినం తరువాత (ఈ నెల 14న) ఉత్సవాలు జరపడం ఇక్కడ ఆనవాయితీ. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆడపడుచులు అత్తగారింట్లో దసరా పర్వదినం వరకు బతుకమ్మ ఆడి ఆ తర్వాత పుట్టింటికి చేరుకుని ఇక్కడ మరో సారి ఉత్సవాల్లో పాల్గొంటారు. గ్రామంలో విశాలమైన ప్రాంతంలో ప్రత్యేకంగా సిమెంట్‌తో బతుకమ్మను తయారు చేశారు. మహిళలు దాని చుట్టూ బతుకమ్మ ఆడుతూ సందడి చేస్తారు.

కోటపై దసరా ఉత్సవం

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలో దసరా ఉత్సవం సంబరంగా జరిగింది. శనివారం సాయంత్రం బురుజు వద్ద ఆయుధ పూజ నిర్వహించారు. కోటపై జాతీయ జెండాను గ్రామ ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఆనవాయితీ ప్రకారం గ్రామ పెద్ద ఒకరు శమీ వృక్షాన్ని ఎత్తుకోగా, ఎదుర్కొని చాముండేశ్వరీ ఆలయానికి వెళ్లారు. అక్కడ బ్రాహ్మణులు శమీ పూజ చేశారు. గ్రామ ఆదాయ, వ్యయాలను రాసి చదివారు. పూజ చేసిన శమీ వృక్షాన్ని చాలా మంది తాకడానికి పోటీ పడ్డారు. అనంతరం గ్రామ పెద్దలకు కంకణాలను కులాల వారిగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ పన్యాల నాగరాజు రెడ్డి, మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచి అంజలి, కుంచాల శేఖర్, ఐరేని నర్సయ్య, నర్సారెడ్డి, కదిరె గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దోమకొండ కోటపై జెండా ఎగురవేస్తున్న గ్రామ ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్

రైతులకు లక్ష్మి కటాక్షం!

● ఏటా రెండు పంటలకు సాగునీరు
● 34,060 ఎకరాలు సస్యశ్యామలం

బీడు భూములకు సాగు నీటిని అందిస్తూ సస్యశ్యామలం చేస్తోంది లక్ష్మి కాల్వ. శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి ఎక్కువగా ప్రయోజనం పొందుతుంది ఈ కాల్వ ఆయకట్టు రైతులే. బాల్కొండ, ముప్కాల్, మెండోరా, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలాల్లో సాగు నీటిని అందిస్తోంది. ఈ ప్రాంత రైతుల ధాన్యాగారంగా, సిరులు కురిపించే కాల్వగా పేరుగాంచింది.

న్యూస్‌టుడే, బాల్కొండ

అధికారిక లెక్కల ప్రకారం 34,060 ఎకరాల చొప్పున ఏటా వానాకాలం, యాసంగి పంటలకు నీరందుతుంది. భూగర్భ జలాలు పెరగడం ద్వారా వేల ఎకరాలకు లబ్ధిచేకూరుతోంది. 38 ఏళ్ల కింద లక్ష్మి కాల్వ నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి పంటలకు గోదారమ్మ పరవళ్లు తొక్కుతూ సాగు భూములను సస్యశ్యామలం చేస్తోంది.

రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. గతంలో రైతులు సాగు నీటి కోసం బోరుబావులు తవ్వించుకునేవారు. నిజాంసాగర్ నీటి కోసం ఎదురు చూసే వారు. కాని లక్ష్మి కాల్వతో సాగు నీటి కష్టాలు తీరాయి. ఏటా రెండు పంటలు పండుతున్నాయి. గ్రామాల్లో చెరువులు నింపడంతో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి.



లక్ష్మి ప్రధాన కాల్వ

డిస్ట్రిబ్యూటరీ	ఆయకట్టు(ఎకరాల్లో)	నీళ్లు అందే మండలాలు
1	120	ముప్కాల్
2	4,505	ముప్కాల్, మెండోరా
3	17,298	ముప్కాల్, బాల్కొండ, మోర్తాడ్, వేల్పూర్
4	3,840	ముప్కాల్, మోర్తాడ్
చౌట్‌పల్లి హనుమంత్‌రెడ్డి ఎత్తిపోతలు	8,297	మోర్తాడ్, కమ్మర్‌పల్లి

వేసవిలో పశువులకు తాగునీటి కొరత లేకుండా పోయింది.

ప్రత్యేకంగా హెడ్‌రెగ్యులేటర్ నిర్మాణం

శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి లక్ష్మి కాల్వకు నీటిని అందించడానికి ముప్కాల్ శివారులో హెడ్‌రెగ్యులేటర్ నిర్మించారు. 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే సామర్థ్యం ఉంది. ప్రధాన కాల్వ కొత్తపల్లి శివారు వరకు ఉంది. దీనికి నాలుగు డిస్ట్రిబ్యూటర్లు ఉన్నాయి. నాలుగో డిస్ట్రిబ్యూటరీ ద్వారా షెట్‌పల్లి వద్ద చౌట్‌పల్లి హనుమంత్‌రెడ్డి ఎత్తిపోతలకు నీరందుతుంది. మూడో డిస్ట్రిబ్యూటరీ కాలువ పెద్దది. దీని కింద ఎక్కువ ఆయకట్టు ఉంది.

సాగు నీటికి ఢోకా లేదు

...బుల్లెట్ రాంరెడ్డి, రైతు, రెంజర్ల



లక్ష్మి కాల్వ నిర్మాణంతో సాగునీటికి ఢోకా లేదు. పంటలకు పుష్కలంగా నీరందుతుంది. సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. బోర్లు బాగా నీటిని పోస్తున్నాయి. చెరువులు సైతం నింపడం వల్ల జలకళ సంతరించుకున్నాయి. నీటి ఇబ్బందులు తొలిగి పంటలు బాగా పండుతున్నాయి. రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నారు.



కల్వర్టు ధ్వంసం

పది కాలాల పాటు మన్నాల్సిన ప్రగతి పనులు మూన్నాళ్ల ముచ్చటగా మారాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేక పనుల నాణ్యత తేలిపోతోంది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో గోదాం రోడ్డు నుంచి బతుకమ్మకుంట వెళ్లేదారిలో కల్వర్టు ధ్వంసమైంది. కూలడానికి సిద్ధంగా ఉంది. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టకపోతే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

– న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం



కూలడానికి సిద్ధంగా..

మతసామరస్యం చాటిన యువకులు

● దుర్గమ్మ చీర, కలశం స్వీకరణ

పోతంగల్, ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే : దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ చీర, కలశాన్ని నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు ముస్లిం యువకులు వేర్వేరు చోట్ల స్వీకరించి మతసామరస్యం చాటారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పోతంగల్ మండలం కల్లూరు గ్రామంలో దుర్గామాత నిమజ్జనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించిన చీరలకు వేలం ఏర్పాటు చేశారు. అందులో పాల్గొన్న గ్రామానికి చెందిన ఎం.డి.అమీన్ ఒక్క చీరను రూ.3వేలకు దక్కించుకున్నారు. అలాగే ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లికి చెందిన మహ్మద్ సాజిద్ గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద పూజల్లో పాల్గొని పూజలందుకున్న కలశాన్ని తన కుటుంబ సభ్యులతో కలిసి స్వీకరించారు. సాజిద్ కుల, మతాలకు అతీతంగా గ్రామంలో జరిగే అన్ని వేడుకల్లో పాల్గొంటారు. ఈ మేరకు సదరు యువకుడిని కౌన్సిలర్లు, వీడీసీ ప్రతినిధులు అభినందించారు.



అమీన్‌కు అమ్మవారి చీర అందిస్తున్న నిర్వాహకులు



కలశం స్వీకరించిన మహ్మద్ సాజిద్

మధుసూదనాచారికి సన్మానం

కామారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: శాసనమండలి ప్రతిపక్షనేతగా ఎన్నికైన మధుసూదనాచారిని ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ ఆదివారం సన్మానించారు. ఆయనను కలిసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు.



కోతులను తరుముతూ.. విద్యుదాఘాతానికి గురై

● బండరామేశ్వర్‌పల్లిలో బాలుడి మృతి



మాచారెడ్డి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన మాచారెడ్డి మండలం బండరామేశ్వర్‌పల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శనిగిరి రాజేశ్(16) శనివారం సాయంత్రం తన వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాడు. వరి పొలంలో ఉన్న కోతులను పచ్చి కట్టెతో వెళ్లగొడుతున్న క్రమంలో.. కట్టె 11 కేవీ విద్యుత్తు తీగలకు తాకి అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి అయినా కుమారుడు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. మృతుడి తండ్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

దసరా కలిపింది...



సదాశివనగర్ : నాలుగు తరాలకు చెందిన కుటుంబ సభ్యులను దసరా పండగ ఒకటి చేసింది. వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి పుట్టిన ఊరు వేదికైంది. సదాశివనగర్ మండలం భూంపల్లికి చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేశ్వర్‌రావుకు చెందిన నాలుగు తరాల కుటుంబాలు ఒక చోటుకి చేరాయి. పిల్లలు, పెద్దలు సొంత ఊరులో పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. సంబంధ బాంధవ్యాలు కృత్రిమంగా మారిపోతున్న ఈ రోజుల్లో భవిష్యత్తు తరాలకు కుటుంబ విలువలు, పండగల ఔన్నత్యం చాటి చెప్పాలనే ఉద్దేశంతో ఏటా స్వగ్రామానికి వచ్చి పండగను జరుపుకుంటామని కుటుంబ సభ్యులు తెలిపారు.

నిజామాబాద్

• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

సేవా కార్యక్రమాల్లో ముందుంటారు

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందుంటారని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారని నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చాలనే నిర్ణయంపై అందరూ ముక్త కంఠంతో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఆర్‌పీ శ్రీనివాస్, సంపత్‌కుమార్, చంద్రశేఖర్, శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి మౌఖిక పరీక్షలు

బోధన్, న్యూస్‌టుడే: బోధన్ డివిజన్ పరిధిలో రేషన్ డీలర్ల నియామకానికి మూడు రోజులు మౌఖిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లో ఖాళీగా ఉన్న 18 దుకాణాలకు గత నెల 26న రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఒక్కో దుకాణానికి అధిక మార్కులు సాధించిన మొదటి ఐదుగురిని ముఖాముఖికి ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికైన వారికి ఈ నెల 15 నుంచి 17 మధ్య ఉదయం 10 గంటల నుంచి మౌఖిక పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.


దసరా ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


బోధన్‌లో పూజలు చేస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో దంపతులు


కోటగిరిలో..


ఎడపల్లిలో..


వేడుకల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ శోభాయాత్ర


కొండూరులో..
మోపాల్‌లో..
ధర్మారం(బి)లో..
నవీపేటలో..


సాలూరలో..

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో విశేష పూజలందుకున్న దుర్గామాతను జిల్లా ప్రజలు ఆదివారం బాసర గోదావరిలో నిమజ్జనానికి ఊరేగించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో అమ్మవారిని మంగళహారతులు, కోలాటాలు, డప్పునృత్యాలతో కొలిచారు. మాలధారులు, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని వర్ని రోడ్, బోధన్ రోడ్, జాన్కంపేట్, నవీపేట మీదుగా బాసరకు తరలించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


కల్దుర్కిలో..


రెంజల్ : నీలాలో..


రుద్రూర్‌లో..


కిషన్‌గంజ్‌లో..


పోతంగల్‌లో..


మోపాల్‌లో..


సత్యనారాయణపురంలో..


బోధన్‌లో...


సిర్నపల్లిగడీ దేవీమాత ఊరేగింపు..


డిచ్‌పల్లిలో..


సిరికొండలో..

ప్రకృతిని ఆరాధించడం గొప్ప సంప్రదాయం

బోధన్ పట్టణం, న్యూస్‌టుడే: భారతీయులు ప్రకృతిని ఆరాధిస్తారని, ఇది గొప్ప సంప్రదాయమని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవాహ దిగంబర్ రావు అన్నారు. శక్కర్‌నగర్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. పండగల విశిష్టతను వివరించారు. వేడుకల్లో ఏసీపీ శ్రీనివాస్, ఉషోదయ విద్యా సంస్థల డైరెక్టర్ దుష్యంత్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు శేఖర్, దాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రొ.సాయిబాబాకు నివాళి

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: దిల్లీ విశ్వవిద్యాలయంలో సహ ఆచార్యుడిగా విధులు నిర్వహించిన ఆచార్య సాయిబాబాకు సీపీఎం కార్యాలయంలో ఆదివారం నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు, నాయకులు వెంకట్రాములు, గంగాధరప్ప పాల్గొన్నారు.

విదేశాల్లో విద్యుత్తు ఉద్యోగుల ప్రతిభ

నిజామాబాద్ క్రీడావిభాగం : మలేసియాలో నిర్వహించిన ఓపెన్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా విద్యుత్తు ఉద్యోగులు సత్తాచాటారు. శని, ఆదివారాల్లో జరిగిన పోటీల్లో వాగ్మారే దినేశ్ లాంగ్ జంప్‌లో బంగారు, ట్రిపుల్ జంప్‌లో రజతం సాధించగా.. గోపి 110 మీటర్ల హర్డిల్ పరుగు పందెంలో వెండి, లాంగ్ జంప్‌లో వెండి, ట్రిపుల్ జంప్‌లో కాంస్యంతో పాటు 4*400 రన్నింగ్ రిలేలో పాకిస్థాన్ జట్టును ఓడించి రజత పతకం సాధించారు.

గుండా మల్లేశ్‌కు నివాళులు

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేశ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు భూమయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజారెడ్డి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో వైద్య దినోత్సవం

బోధన్ : రాకాసిపేట్ సీఎస్ఐ చర్చిలో వైద్య దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య వృత్తిలో ఉన్న వారిని సత్కరించారు. పవిత్రమైన, ప్రాణం పోసే వృత్తిలో పనిచేస్తున్న వారిని గౌరవించాలని, సిబ్బంది వృత్తి పట్ల నిబద్ధత పాటించాలని ఫాదర్ రెవరెండ్ రూబెన్ సూచించారు. కార్యక్రమంలో ప్రతినిధులు అమృతరావు, పాపారావు, ప్రసాద్, విజయ్, అశోక్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: లారీ ఢీకొని ముగ్గురికి గాయాలైన ఘటన మూడో ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన గణేశ్, రాయుడి రాజు, మత్తు రాజులు ద్విచక్రవాహనంపై కాలూరు నుంచి దుబ్బ వస్తుండగా.. అతి వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో మత్తు రాజు, రాయుడి రాజుకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన గణేశ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. గణేశ్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్ తెలిపారు

జూదరుల అరెస్టు

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని గాయత్రినగర్‌లోని శ్మశానవాటిక వద్ద జూదం ఆడుతున్నారనే సమాచారంతో నాలుగో ఠాణా పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 6140 నగదు, నాలుగు చరవాణులు స్వాధీనం చేసుకున్నారు.


శక్కర్‌నగర్ రామ్‌లీలా మైదానంలో రావణ దహనానికి వచ్చిన ప్రజలు


గాయత్రీనగర్‌లో..


బోధన్‌లో శమీ చెట్టుకు పూజలు..


కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి పూజలు


మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డితో నాయకులు


నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల క్షేత్రంలో..


ఏఆర్‌క్యాంపులో..


కోటగిరిలో..


ఇందూరు ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో..


బర్దీపూర్‌లో జమ్మి పూజకు వెళ్తున్న గ్రామస్థులు

వైభవంగా విజయదశమి వేడుకలు


వినాయక్‌నగర్ కొత్త హౌసింగ్‌బోర్డు కాలనీలో..

న్యూస్‌టుడే బృందం : విజయదశమి వేడుకలు జిల్లావ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు నగరంతో పాటు బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గాల్లోని వివిధ పట్టణాలు, గ్రామాలు, మండలకేంద్రాల్లో ఉన్న ఆలయాల్లో పూజలు, హోమాలు నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా గ్రామ పొలిమేరల్లోకి వెళ్లి జమ్మి చెట్టుకు పూజలు చేశారు. బంగారం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పాలపిట్ట చూడటానికి ఆసక్తి చూపారు. రావణ దహనం చేశారు.


బోర్గాం(పి)లో.. జడకొప్పులాట


ఇందల్‌వాయిలో..


జెండాబాలాజీ ఆలయంలో..


డిచ్‌పల్లి : సుద్దపల్లిలో..


రెంజల్‌లో..


మాణిక్‌భవన్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు


జక్రాన్‌పల్లి : అర్గుల్‌లో..

బీజాక్షర క్షేత్రంలో దిల్ రాజు పూజలు

నవీపేట, న్యూస్‌టుడే : ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు కుటుంబ సభ్యులతో కలిసి నవీపేట మండలం యంచలోని బీజాక్షర క్షేత్రాన్ని ఆదివారం సందర్శించారు. ఈ మేరకు యజ్ఞం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. క్షేత్రం వ్యవస్థాపకుడు వేద విద్యానందగిరి స్వామి దిల్‌రాజ్, ఆయన భార్య తేజస్విని నాలికపై బీజాక్షరాలు రాశారు. వారి కుమారుడితో ప్రత్యేక పూజ చేయించారు. స్వామి చేపడుతున్న కార్యక్రమాలపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. దిల్‌రాజు కుటుంబీకులను మాజీ సర్పంచి లహరి, ప్రవీణ్‌తో పాటు పలువురు గ్రామస్థులు సన్మానించారు.

అవస్థల ప్రయాణం

న్యూస్‌టుడే, ధర్పల్లి (ఇందల్‌వాయి)

నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఇందల్‌వాయి- ధర్పల్లి రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. అనేక ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపు కరవైంది. పనులకు గత ప్రభుత్వ హయాంలో రూ. 7కోట్లు మంజూరు చేశారు. కానీ, అసంపూర్తి పనులతో ఇబ్బందులు తప్పడం లేదు.


రహదారి ఒకవైపు గుంతలుగా మారడంతో వ్యతిరేక దిశలో వెళ్తున్న వాహనాలు

ప్రమాదాలకు నెలవు..

తిర్మన్‌పల్లి నుంచి అన్సాన్‌పల్లి వరకు నూతన లేయర్ వేసినప్పటికీ వెంగల్‌పాడ్ పరిధితో పాటు అన్సాన్‌పల్లి పరిధిలో కొంతభాగం అసంపూర్తిగా వదిలేశారు. ముఖ్యంగా ఎల్లారెడ్డిపల్లి-అన్సాన్‌పల్లి పరిధిలో రోడ్డుకు ఒకవైపు పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటి వరకు ఈ ఒక్క ప్రదేశంలోనే పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకోగా నలుగురు మృత్యువాత పడ్డారు.

ఎమ్మెల్యే చొరవ చూపాలి

..వాసు, మాజీ సర్పంచి, అన్సాన్‌పల్లి

రోడ్డు బాగా లేని కారణంగా ఆరు నెలల కిందట రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని నల్లవెల్లికి చెందిన ఓ యువకుడు చనిపోయారు. నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. ఎమ్మెల్యే దృష్టి సారించాలి.

●● ఆర్అండ్‌బీ ఏఈ గంగాధర్ మాట్లాడుతూ.. అటవీశాఖ అభ్యంతరంతో పనులు నిలిచాయి. ప్రమాదాలపై గతంలోనే ఉన్నతాధికారులకు నివేదించాం. మరోసారి వారి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.


తాహెర్ బిన్ హందాన్‌తో సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

సిరికొండ : సిరికొండ మసీద్ నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా షేక్‌జావీద్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ అసిఫ్, కోశాధికారిగా ఖాదర్, సభ్యులుగా ముషీర్, సలావుద్దీన్, మునీర్, అమెర్, గౌస్‌బాషా, రైస్, అర్షద్ అలీలను ఎన్నుకున్నారు. అనంతరం వీరు రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్‌ను కలిశారు.

ఎమ్మార్పీఎస్ ..

పోతంగల్ : పోతంగల్ మండల ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా వీరయ్య, ఉపాధ్యక్షులుగా సాయిలు, గణేష్, లాలయ్య, ప్రధాన కార్యదర్శిగా సంగయ్య, అధికార ప్రతినిధిగా గంగారాం,ఎంఎస్ఎఫ్ మండలాధ్యక్షుడిగా హరిదాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 16న మందకృష్ణ మాదిగ నిజామాబాద్ వస్తున్నారని, కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు పోచీరాం కోరారు.

అనుమానాస్పద స్థితిలో ప్రైవేట్ ఉద్యోగి మృతి

నవీపేట, న్యూస్‌టుడే : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందారని ఎస్సై వినయ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నవీపేటకు చెందిన కొలాస సంజీవ్‌కుమార్ (50) ప్రైవేటు ఉద్యోగం చేసేవారు. అతనికి భార్య సుమలత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన సంజీవ్‌కుమార్ తిరిగి రాలేదు. నవీపేట శివాజీ కూడలి సమీపంలోని కాల్వ తూము వద్ద ఆదివారం ఉదయం అతని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి ఘటనా స్థలిని పరిశీలించారు. మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పలు వివరాలు తెలిపారు. 'నా భర్తతో ఆయన స్నేహితులు కొందరు కలిసి తరచూ మద్యం తాగేవారు. తాగొద్దని వారికి పలుమార్లు చెప్పినా వినలేదు. స్థానిక వెంచర్‌లో ఓ స్నేహితుడితో కలిసి శనివారం రాత్రి తాగినట్లు తెలిసింది. నా భర్త మృతిపై అనుమానం ఉంది. సదరు స్నేహితులను విచారించి మృతికి గల కారణాలు తెలుసుకుని, నా పిల్లలకు న్యాయం చేయాలి' అని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమలత ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో సంజీవ్‌కుమార్ మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. ఘటనా స్థలిని నిజామాబాద్ రూరల్ సీఐ సతీష్‌కుమార్, ఎస్సై పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు.


సంజీవ్‌కుమార్

కెనాల్‌లో పడి..

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: సారంగాపూర్‌లోని డైరీ ఫామ్‌లో నివాసం ఉండే ప్రశాంత్‌రాజ్ (38) శనివారం మద్యం మత్తులో ఇంటికి దగ్గరలో ఉన్న కెనాల్ దాటే ప్రయత్నం చేశారు. ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందారని ఎస్సై మొగులయ్య తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం..

రెంజల్, న్యూస్‌టుడే : రెంజల్ మండలం కందకుర్తి గోదావరిలో శనివారం ఓ యువకుడు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ మండలం ఖండ్‌గాం గ్రామానికి చెందిన లక్ష్మణ్ (26) ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయన భార్య ఆరు నెలల కిందట మృతిచెందింది. రెంజల్ మండలం సాటాపూర్‌లో సోదరి వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మణ్ ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ భార్య మృతి జీర్ణించుకోలేక శనివారం ద్విచక్ర వాహనంపై కందకుర్తి గోదావరి నదికి వెళ్లారు. అక్కడే వాహనం వదిలి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు గల్లంతు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

క్రైమ్ కార్నర్

స్వగ్రామం చేరిన మృతదేహం

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లి అనారోగ్యంతో మృతిచెందిన నల్లవెల్లి గ్రామానికి చెందిన ఒడ్డె శంకర్ (50) మృతదేహం తెలుగు కళా సమితి చొరవతో ఆదివారం స్వగ్రామం చేరింది. స్థానికుల వివరాల ప్రకారం.. శంకర్ ఏడు నెలల కిందట ఉపాధి కోసం విజిట్ వీసాపై బెహరన్ వెళ్లారు. అక్కడే పని చేస్తూ జీవనం సాగించారు. ఈ క్రమంలో అనారోగ్యం పాలై దవాఖానాలో చికిత్స పొందుతూ ఇటీవల చనిపోయారు. మృతదేహాన్ని స్వగ్రామం పంపాలని ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహంనాయుడు తెలుగు కళా సమితికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన సమితి ప్రతినిధి నోముల మురళి ఇండియన్ ఎంబసీతో మాట్లాడి రూ. 2 లక్షలు మంజూరు చేయించడంతో మృతదేహం ఆదివారం స్వగ్రామం చేరింది. ఈ సందర్భంగా కోటపాటి నరసింహంనాయుడు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏడు దేశాలకే పరిమితమైన జీవో నెంబర్ 205, 206లను అన్ని గల్ఫ్ దేశాలకు వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు.


శంకర్

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నాలుగో ఠాణా పరిధిలో ఓ మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వినాయక్‌నగర్‌లోని పెట్రోల్ బంక్ వద్ద ఓ మహిళ నిలబడి ఉండగా.. ద్విచక్రవాహనంపై వచ్చిన దుండగులు ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లే ప్రయత్నం చేయగా.. అప్రమత్తమై సదరు మహిళ గొలుసును గట్టిగా పట్టుకుంది. మూడు వరసల గొలుసులో ఒక వరస దుండగుడి చేతిలోకి వెళ్లగా మిగిలిన రెండు వరసల గొలుసు బాధితురాలి చేతిలోనే ఉండిపోయింది. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పాత కక్షలతో ముగ్గురిపై కత్తితో దాడి

● బోధన్‌లో కలకలం రేపిన కత్తిపోట్లు

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే : బోధన్ పట్టణంలో శనివారం జరిగిన కత్తిపోట్ల ఘటన స్థానికంగా కలకలం రేపింది. పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రాకాసిపేట్‌లోని గాంధీనగర్‌కు చెందిన అజీముద్దీన్‌తో అదే ప్రాంతానికి చెందిన షేక్‌మన్సూర్ పాత గొడవలు మనసులో పెట్టుకొని గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో గొడవ ఆపేందుకు యత్నించిన అజీముద్దీన్ కొడుకు రిహాన్, అతని సోదరుడు జావిద్‌లపై మన్సూర్ తన వద్ద ఉన్న కత్తితో దాడికి చేయడంతో వారికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. నిందితుడు మన్సూర్‌ను అదుపులోకి తీసుకుని, అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.



ఎమ్మెల్యే ఇంట్లో సంబురాలు

కమ్మర్‌పల్లి(వేల్పూర్), న్యూస్‌టుడే: మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దసరా పండుగ పురస్కరించుకొని ఆదివారం వేల్పూర్‌లోని తన నివాసంలో అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహించారు. భారాస నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆత్మీయులు హాజరై దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అందరితో కలిసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనాలు చేశారు.

ఆర్మూర్

• ఆర్మూర్ • బాల్కొండ



పల్లకీ సేవ

బాల్కొండ, న్యూస్‌టుడే: వన్నెల్(బి)లో విజయదశమి రోజున గ్రామ, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామికి పల్లకీ సేవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వాముల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగించారు. పల్లకీ సేవ జరిపారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు.

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్) — ఈనాడు సినిమాలు



స్క్రీన్‌-1 **మార్టిన్:** 9.00, 3.30, 10.10
జిగ్రా: 12.10
వెట్టయాన్ ది హంటర్: 6.40
స్క్రీన్‌-2 **దేవర:** 9.30, 4.05, 10.40
జనక అయితే గనక: 1.05, 7.40
స్క్రీన్‌-3 **వెట్టయాన్ ది హంటర్:** 9.40, 4.00, 10.20, **మా నాన్న సూపర్ హీరో:** 1.10, 7.30
స్క్రీన్‌-4 **విశ్వం:** 9.45, 1.00, 7.15, 10.30
జనక అయితే గనక: 4.15

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా..
94939 26837
98666 11160

డిస్ట్రిబ్యూటరీ కాలువలో చెత్త తొలగింపు



ఏర్గట్ల, న్యూస్‌టుడే: ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్, గుమ్మిర్యాల్ శివారులో డీ-19 డిస్ట్రిబ్యూటరీ కాలువలో చెత్త, ముళ్ల పొదలు ఉండడంతో ప్రవాహం ఆగిపోయింది. నీటిపారుదల అధికారులు పట్టించుకోలేదంటూ స్థానిక రైతులు 'మేమున్నాం...మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన నీటిపారుదల అధికారులు(లస్కర్లు) కాలువలోని చెత్తను తొలగించి శుభ్రం చేసి సమస్యను పరిష్కరించారు

పనిచేయని యంత్రం.. గర్భిణులపై ఆర్థికభారం



ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రి

న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

ఆర్మూర్ వంద పడకల ఆసుపత్రిలో ఏఎన్‌సీ సేవలు ముఖ్యమైనవి. ప్రసవాలు ఎక్కువగా జరుగుతాయని డివిజన్ ప్రజల నమ్మకం. అన్ని వసతులున్న ఈ ఆసుపత్రిలో ప్రసవం చేసుకోవడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు లాభం చేకూరుతోంది. ఇంత వరకు బాగానే ఉన్నా గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు పలుమార్లు అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేస్తారు. ఈ నివేదిక ఆధారంగానే వైద్యులు సేవలందిస్తారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్ ఆసుపత్రికి వచ్చినా, ఒక్కసారి కూడా ఉపయోగించిన దాఖలాలు లేవు.

రేడియాలజిస్ట్ అవసరం ఉండగా, ఆ పోస్టుకు సంబంధించిన వైద్యులెవరూ లేకపోవడంతో సమస్య తీరలేదు. నిత్యం 50-70 వరకు ఏఎన్‌సీ ఓపీ నమోదు అవుతుండగా ఇందులో నెలవారి చెకప్‌ల కోసం వచ్చే వారే అధికంగా ఉంటున్నారు. గర్భం దాల్చినప్పుడు, మూడు, అయిదు, ఏడు, తొమ్మిది నెలల్లో, ప్రసవానికి ముందు కూడా పలువురికి స్కానింగ్ చేయిస్తారు. ముగ్గురు గైనకాలజిస్టులు ఉండగా, స్కానింగ్ అవసరం ఉన్నప్పుడు ఆర్మూర్‌లోని పలు ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు రిఫర్ చేస్తున్నారు.

నిపుణులు లేకపోవడంతో..

అల్ట్రాసౌండ్ స్కానింగ్ అందుబాటులో ఉన్నా.. సంబంధిత వైద్యుడు(రేడియాలజిస్ట్)ను కేటాయించకపోవడంతో ప్రస్తుతం మూలకు చేరింది. అధిక నిధులు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రం, మరమ్మతులకు వచ్చింది. దానిని ఉపయోగించే వైద్యులు లేకపోవడంతో సమస్య ఏర్పడింది. గతంలో ఇక్కడ పని చేసిన గైనకాలజిస్టులకు కొంత శిక్షణ ఇచ్చారు, వారు అత్యవసర సేవల కోసం వినియోగించారు. పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి తీసుకురాలేకపోయారు. మరమ్మతులు చేయించి, ఉపయోగంలోకి తీసుకురావడంతో పాటు సంబంధిత వైద్యుడిని కేటాయిస్తే ఈ సమస్య తీరనుంది.

రూ.10 వేల వరకు ఖర్చు..

గర్భిణులకు నెలవారి ముందులు, రక్త, మూత్ర పరీక్షల సేవలు ఉచితంగానే అందుతున్నాయి. స్కానింగ్ వసతి లేకపోవడంతో ప్రైవేటుకు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడకు వచ్చేది పేద, మధ్య తరగతికి చెందిన ప్రజలే కావడంతో 9 నెలల కాలంలో సుమారు రూ.10 వేల వరకు ఖర్చు అవుతుంది. కొందరి ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా స్కానింగ్‌లో కొన్ని అదనంగా చేయాల్సి ఉండగా వాటికి మరిన్ని ఖర్చు చేయాల్సి ఉంది.



ఆర్మూర్‌లో పనిచేయని అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం

వినియోగంలోకి తీసుకురావాలి..

స్త్రీవైద్య నిపుణులు అందుబాటులో ఉండటంతో ఇక్కడకు వస్తున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. స్కానింగ్ సేవలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ సేవల కోసం ప్రైవేటుకు వెళ్తున్నాం. రకరకాల స్కానింగ్ ఉండటంతో పడిగాపులు కాస్తున్నాం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు మరింత ఇబ్బంది పడుతున్నారు.
- శ్వేత, ఆర్మూర్

నాకు అయిదు నెలలు.. ఇప్పటివరకు మూడు సార్లు స్కానింగ్ చేయించారు. రూ. 4 వేలు ఖర్చు పెట్టాం. ఆర్థిక భారంగా మారుతోంది. ఉచితంగా ఈ సేవలు సైతం ఇక్కడే అందేలా వైద్య ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.
మనస్వినీ, ఆర్మూర్

ఇబ్బందులు పడుతున్నాం..

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఆర్మూర్ ప్రభుత్వాసుపత్రిలో ఉన్న అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం ప్రస్తుతం పనిచేయడం లేదు. ఈ సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సంబంధిత ఇంజినీర్లను పిలిపించి, యంత్రం మరమ్మతులు చేయించే అవకాశం ఉందో, లేదో తెలుసుకుంటాం. మరమ్మతులు పూర్తయి, యంత్రం అందుబాటులోకి వస్తే, రేడియాలజిస్టును కేటాయించాలని కోరుతాం.
డా.రవికుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్మూర్

విజయానికి సూచిక విజయదశమి



మాట్లాడుతున్న వెంకట శివ కృష్ణ

బాల్కొండ, న్యూస్‌టుడే: మన దేశ సంప్రదాయం ఎంతో పవిత్రమైందని విశ్వహిందూ పరిషత్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ నర్రా వెంకట శివ కృష్ణ అన్నారు. దసరా సందర్భంగా బాల్కొండలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం రావణుని దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలన్నారు. విజయానికి సూచిక, చెడుపై మంచి సాధించిన విజయమే విజయ దశమని పేర్కొన్నారు. హిందువులు ఐక్యంగా ఉంటూ దేశాన్ని రక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో అమృతధార సేవా సంస్థ వ్యవస్థాపకులు నారాయణ, లింగాగౌడ్, వీహెచ్‌పీ అధ్యక్షుడు రమేష్, వీహెచ్‌పీ నాయకుడు రాయ కృష్ణ, రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రకృతిని ఆరాధించే సంప్రదాయం మనది

బోధన్ పట్టణం: భారతీయులది ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయమని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవాహ దిగంబర్‌రావు అన్నారు. శక్కర్‌నగర్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

ఘనంగా దసరా వేడుకలు



ఆర్మూర్‌లోని వేడుకల్లో బల్దియా ఛైర్‌పర్సన్ లావణ్య



ఆర్మూర్ పట్టణంలో..



బాల్కొండలో మహాలక్ష్మి మందిరం వద్ద..



జంబి హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్మూర్‌లో జంబి హనుమాన్ ఆలయ ఆవరణలో దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, పుర ఛైర్‌పర్సన్ లావణ్య, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు. జెండా బాలాజీ ఆలయం నుంచి రథం ఊరేగింపుగా జంబి హనుమాన్ ఆలయానికి చేరుకొంది. సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఆలయంలో పూజలు చేశారు. అనంతరం రావణ దహనం నిర్వహించారు. మామిడిపల్లిలోనూ రావణ దహనం జరిపారు.

బాల్కొండ, మెండోరా: ప్రజలు కొత్త దుస్తులు ధరించి డప్పు వాయిద్యాల మధ్య జంబికి వెళ్లారు. పూజ అనంతరం ఒకరికొకరు జంబి ఆకు(బంగారం) పంచుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లిలో దసరా ఉత్సవాన్ని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. హిందూ జన జాగృతి ఆధ్వర్యంలో ఆయుధాలకు శస్త్రపూజ చేశారు. శ్రీగిరిక్షేత్రం వద్ద రావణుడి ప్రతిమను దహనం చేశారు. దుర్గాదేవిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో రామస్వామి, బుచ్చిమల్లయ్య, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.



మామిడిపల్లి వీడీసీ ఆధ్వర్యంలో రావణ సంహారం



బాల్కొండలో జంబి వద్ద వీడీసీ సభ్యులు, స్థానికులు

నేత్రపర్వంగా శోభాయాత్ర


మాక్లూర్, న్యూస్‌టుడే: మాక్లూర్‌లో ఆదివారం దుర్గామాత నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళలు మంగళ హారతులతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. యువకులు నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ అలరించారు.



దుర్గాదేవిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



బాల్కొండలో



వెల్మల్‌లో..

నందిపేట్ గ్రామీణం: వెల్మల్, అయిలాపూర్, కంఠం, తల్వేద, బజార్‌కొత్తూర్, ఉమ్మెడ, బాద్గుణ, సి.హెచ్.కొండూర్ గ్రామాల్లో దుర్గాదేవి ప్రతిమల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. శనివారం రావణదహనం నిర్వహించి దసరా వేడుకను కనుల పండువగా జరిపారు. ఆదివారం కోలాటలు, భజనలు, డీజే నృత్యాల మధ్య ఊరేగింపుగా వెళ్లి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు.

బాల్కొండ: బాల్కొండలో దుర్గాదేవి శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గాదేవి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. మహాలక్ష్మి మందిరం వద్ద దుర్గాదేవిని భారీ అలంకరణ మధ్య దీక్షా భక్తులు నిమజ్జనానికి తరలించారు.

బాల్కొండ: బాల్కొండలో దుర్గాదేవిని ఆదివారం రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార సంఘాల ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. మహాలక్ష్మి మందిరం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

భీమ్‌గల్ గ్రామీణం: జాగిర్యాల్ గ్రామంలో అమ్మవారిని భజన కీర్తనలతో మంగళ హారతులతో ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామ ఊర చెరువులో నిమజ్జనం చేశారు.

ఆర్మూర్ పట్టణం: దేవి విగ్రహాల శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. చిన్నారులు దాండియాలు ఆడారు. ఆయా చెరువుల్లో నిమజ్జనం చేశారు.



మాక్లూర్‌లో..



కంఠం గ్రామంలో..



ఆర్మూర్‌లో దాండియా ఆడుతున్న చిన్నారులు

ఆర్థిక సాయం అందజేత



హొసాకొత్తూర్(కమ్మర్‌పల్లి), న్యూస్‌టుడే: హొసాకొత్తూర్‌లో బోరిగం గంగాధర్, ప్రతి రాజేశ్వర్ అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాలకు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్‌పార్టీ బాధ్యులు ముత్యాల సునీల్‌రెడ్డి రూ. 10 వేల చొప్పున అందించారు. కార్యక్రమంలో పడిగల ప్రవీణ్, రేవతి గంగాధర్, లింగారెడ్డి, శ్రీనివాసు ఏనుగు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

తాళం మేళం కొనుగోలుకు సాయం

జలాల్‌పూర్(బాల్కొండ), న్యూస్‌టుడే: జలాల్‌పూర్ శివారు శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో సయ్యద్ వజీర్ రూ. 22000 వితరణగా అందజేశారు. కుల, మతాలకు అతీతంగా తాళం మేళం కొనుగోలుకు సాయం అందజేయడంపై ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మందిరంలో ఆయనను సన్మానించారు. వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ క్యాతం కిషన్‌గౌడ్, అనిల్, ఎత్తిపోతల కమిటీ ఛైర్మన్ గంగారెడ్డి, గుండేటి మోహన్‌రెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

భీమ్‌గల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మెండోరా గ్రామం మాజీ సర్పంచి బెల్దారి పోషన్న ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆదివారం వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట గ్రామ భారాస నాయకులు ఉన్నారు.

అవీ...ఇవీ.. అన్నీ

వివాహిత ఆత్మహత్య

నందిపేట్: నందిపేట్ మండల కేంద్రానికి చెందిన సాయమ్మ(50) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. మద్యానికి బానిసై శనివారం మత్తులో మూత్రశాలలోని కెమికల్ తాగి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మోర్తాడ్‌లో వృద్ధుడు..

మోర్తాడ్(కమ్మర్‌పల్లి): మోర్తాడ్‌లో నూతికట్టు వెంకటేష్(50) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మోర్తాడ్‌కు చెందిన వెంకటేష్ ఆరోగ్యం బాగలేక జీవితంపై విరక్తి చెంది ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని వేపచెట్టుకు ఉరేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కెనాల్‌లో పడి ఒకరి ...

నిజామాబాద్ నేరవిభాగం: సారంగాపూర్‌లోని డైరీ ఫామ్‌లో నివాస ప్రశాంత్‌రాజ్(38) శనివారం మద్యం మత్తులో ఇంటికి దగ్గర్లో ఉన్న కెనాల్ దాటే ప్రయత్నం చేశారు. ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందారని ఎస్సై మొగులయ్య తెలిపారు.

డీఎస్సీ విజేతకు సన్మానం

ఏర్గట్ల, న్యూస్‌టుడే: ఏర్గట్ల మండలం తొర్తి గ్రామానికి చెందిన ఈర్గాల సృజన్ ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీ ఓపెన్ కేటగిరిలో ఉద్యోగం పొందాడు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ యువజన సంఘాల సభ్యులు, పూర్వ విద్యార్థులు కలిసి ఆదివారం సృజన్‌ను, అతని తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచి తాహెర్ ఖాన్, భారాస మండల ఉపాధ్యక్షుడు జక్కు గంగాధర్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఈశ్వర్, యువకులు పాల్గొన్నారు.



దిల్‌రాజు పూజలు

నవీపేట,: ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు కుటుంబ సభ్యులతో కలిసి నవీపేట మండలం యంచలోని బీజాక్షర క్షేత్రాన్ని ఆదివారం సందర్శించారు. ఈ మేరకు యజ్ఞం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. క్షేత్రం వ్యవస్థాపకుడు వేద విద్యానందగిరి స్వామి దిల్‌రాజ్, ఆయన భార్య తేజస్విని నాలికపై బీజాక్షరాలు రాశారు. వారి కుమారుడు అన్వితో ప్రత్యేక పూజ చేయించారు. స్వామి చేపడుతున్న కార్యక్రమాలపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. దిల్‌రాజు కుటుంబీకులను మాజీ సర్పంచి లహరి, ప్రవీణ్‌తో పాటు పలువురు గ్రామస్థులు సన్మానించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సిరికొండ: మండల కేంద్రంలోని మసీద్ నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా షేక్ జావీద్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ ఆసిఫ్, కోశాధికారిగా ఖాదర్, సభ్యులుగా ముషీర్, సలావుద్దీన్, మునీర్, అమెర్, గౌస్ బాషా, రైస్, అర్షద్‌అలీలను ఎన్నుకున్నారు. అనంతరం వీరు రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్‌ను కలిశారు.

ఉత్సాహంగా సద్దుల బతుకమ్మ



బాల్కొండ, న్యూస్‌టుడే: బాల్కొండలో సద్దుల బతుకమ్మను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఏటా దసరా పండుగ తర్వాత జరుపుకొంటారు. మహిళలు బతుకమ్మలు పేర్చి పాటలు పాడుతూ ఆడారు. అన్ని ప్రధాన వీధుల్లో శోభాయాత్రగా తీసుకెళ్లారు. స్థానిక ఊర చెరువులో నిమజ్జనం చేశారు. చెరువు గట్టున భోజనాలు చేశారు.



బాల్కొండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఐర్లాండ్‌లో ...

వేల్పూర్(కమ్మర్‌పల్లి): ఐర్లాండ్‌లో ఉంటున్న అంక్సాపూర్, వేల్పూర్ గ్రామాలకు చెందిన మహిళలు ఆదివారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి ఆడిపాడారు. ఏటా వేడుకలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



అపరిశుభ్రంగా ప్లాట్లు.. రోగాలతో ప్రజల పాట్లు..

భీమ్‌గల్, న్యూస్‌టుడే:

భీమ్‌గల్ పురపాలిక పరిధిలో నిర్మించకుండా వదిలేసిన ఖాళీ ప్లాట్లు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో చెత్త, పిచ్చి మొక్కలు, వర్షపు నీటితో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పురపాలక యంత్రాంగం అలసత్వం, ఆయా ప్లాట్ల యజమానుల నిర్లక్ష్యం కారణంగా ఈ దుస్థితి నెలకొంది.

యజమానులదే బాధ్యత

పురపాలక పరిధిలోని ప్లాట్లలో కొందరు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో మురుగు నీరు చేరి దుర్వాసన వస్తోంది. అయితే వాటిని చదును చేసి శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఆయా ప్లాట్ల యజమానులపైనే ఉంటుంది. ప్రధానంగా విలీన, నూతన లే-అవుట్ చేసిన కాలనీల్లో సమస్య ఎక్కువగా ఉంది. బాపూజీనగర్, శ్రీరాంనగర్, అంగడి బజారు, పురాణీపేట్, వేల్పూర్, బడాభీమ్‌గల్, బాబాపూర్ రోడ్లు తదితర ప్రాంతాలలో ఎక్కడ చూసినా నిర్లక్ష్యంగా వదిలేసిన ఖాళీ ప్లాట్లు దర్శనమిస్తున్నాయి.



భీమ్‌గల్‌లోని ఓ ప్లాటులో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం

పట్టించుకోని పురపాలక యంత్రాంగం

పురపాలక సంఘం	వార్డులు	జనాభా	గృహాలు
భీమ్‌గల్	12	21,900	4,760
ఆర్మూర్	36	64,023	22,188

పురపాలక చట్టం ప్రకారం జరిమానాలు

నూతన పురపాలక చట్టం ప్రకారం ఖాళీగా ఉన్న ప్లాట్లను అపరిశుభ్రంగా వదిలేస్తే చర్యలు తీసుకునే అధికారం యంత్రాంగానికి ఉంది. పురపాలక సంఘం వారే పిచ్చి మొక్కలు, దుర్గంధాన్ని తొలగించి చదును చేయించాలి. అందుకు అయిన ఖర్చును సదరు యజమాని నుంచి వసూలు చేయాల్సి ఉంటుంది. పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇచ్చారు. కొందరు శుభ్రం చేసుకున్నారు. మరి కొందరు స్పందించకపోవడంతో పురపాలక సంఘం వారే స్వయంగా శుభ్రం చేశారు. కాగా ఖాళీ ప్లాట్లు ఎన్ని ఉన్నాయి? వాటి యజమానులు ఎవరు? అనే విషయం తెలియకపోవడం యంత్రాంగానికి సమస్యగా మారింది. మరోవైపు త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఖాళీ స్థలం ఇలా..

క్రమబద్ధీకరణ కోసం వేలల్లో దరఖాస్తులు

ఎల్‌ఆర్‌ఎస్‌లో భాగంగా తమ ఖాళీ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం భీమ్‌గల్‌లో 1,456 దరఖాస్తులు, ఆర్మూర్‌లో 4,125 దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో భీమ్‌గల్‌లో ఒక్క దరఖాస్తు కూడా ఆమోదించలేదు. ఆర్మూర్‌లో 537 దరఖాస్తులు ఆమోదించారు.

గతంలో నోటీసులు జారీ చేశాం

- మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణ

ప్లాట్లు శుభ్రంగా ఉంచుకోని యజమానులకు ఇది వరకే నోటీసులు జారీ చేశాం. పట్టణ ప్రగతిలో పిచ్చి మొక్కలు తొలగించాం. మరో మారు నోటీసులు అందజేసి శుభ్రం చేయిస్తాం.

హైవోల్టేజీతో కాలిన విద్యుత్తు పరికరాలు

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: కమ్మర్‌పల్లిలోని పోచమ్మ, మినీజూబ్లీ, లక్ష్మీనగర్ కాలనీలో ఇళ్లకు శుక్రవారం రాత్రి హైవోల్టేజీ విద్యుత్తు సరఫరా కావడంతో విద్యుత్తు పరికరాలన్నీ కాలిపోయాయి. టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ఇతర విద్యుత్తు పరికరాలన్నీ కాలిపోయాయని కాలనీవాసి బద్దం రాజశేఖర్ తెలిపారు. కోతి విద్యుత్తు తీగలపై దూకడంతో ఫేస్ తీగలు కలిసిపోయి హైవోల్టేజీ వచ్చిందని ట్రాన్స్‌కో ఏఈ బాల్‌రాజ్ తెలిపారు.